GV MALL shop & celebrate TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA



ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్పార్క్ ఎడిషన్ Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 142 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 + https:www.prajarepublic.com + వెల - 1/-

శనివారం 28 డిసెంబర్ 2024

RNI No: APTEL/2023/87888

Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు

## .. తెలుగువారికి గర్వకారణం: సీఎం చంద్రబాబు

విజయవాడలో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహించుకోవడం తెలుగువారికి గర్వకారణమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు.

విజయవాడ, డిసెంబర్ 28, (రిపబ్లిక్ న్యూస్): ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహించుకోవడం తెలుగువారికి గర్వకారణమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు.



మాతృభాషను భవిష్యత్ తరాలకు పదిలంగా అందించడమే లక్ష్యంగా ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం జరిగే ప్రాంగణానికి అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును పెట్టడం, ఆ మహానుభావుడు తెలుగు జాతి కోసం చేసిన త్యాగాన్ని ప్రతి ఒక్కరికీ గుర్తు చేస్తోందన్నారు. ప్రధాన వేదికకు తెలుగు భాషాభివృద్ధి కోసం గణనీయ కృషి చేసిన రామోజీరావు పేరు పెట్టడం అభినందనీయమని చెప్పారు. ఈ మహాసభలకు విచ్చేసిన అతిథులకు, పాల్గొంటున్న తెలుగు భాషాభిమానులకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావాలని కోరుకుంటూ.. నిర్వాహకులకు చంద్రబాబు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## పరకామణిలో రూ.100 కోట్ల కుంభకోణం :భానుప్రకాశ్ రెడ్డి

తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో భాజపా ప్రతినిధుల బృందం ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావును కలిసింది.



అమరావతి, డిసెంబర్ 28, (రిపబ్లిక్ న్యూస్): తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో భాజపా ప్రతినిధుల బృందం ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావును కలిసింది. తిరుమల పరకామణి కేసు విషయంలో ఆయనకు నేతలు ఫిర్యాదు చేశారు. తితిదే పరకామణిలో విదేశీ డాలర్ల మాయం ఘటనపై విచారణ చేయాలని అందులో పేర్కొన్నారు. ఈ మేరకు భానుప్రకాశ్ రెడ్డి, పాతూరి నాగభూషణం నాలుగు పేజీల లేఖను డీజీపీకి అందజేశారు. సమగ్ర విచారణ జరపాలని పరకామణిలో రూ.100 కోట్ల కుంభకోణం జరిగిందని భానుప్రకాశ్‌రెడ్డి ఆరోపించారు. రహస్య అర అమర్చి డబ్బులు తరలించారని చెప్పారు. తరలించిన మొత్తాన్ని వెనక్కి రప్పించాలని డీజీపీని భాజపా బృందం కోరింది.

# ఇది వైకాపా రాజ్యం అనుకుంటున్నారా..

## ఖబడ్దార్: పవన్ కల్యాణ్

కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబును డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పరామర్శించారు.

కడప, డిసెంబర్ 28, (రిపబ్లిక్ న్యూస్): కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబును డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.





అనంతరం పవన్ మీడియాతో మాట్లాడారు."గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబును అమానుషంగా కొట్టారు. అధికారులపై దాడి చేయడం వైకాపాకు కొత్త కాదు. ఆధిపత్యం, అహంకారంతో అధికారులపై దాడులు చేస్తే ఎలాంటి శిక్షలు పడతాయో చూపిస్తాం. అహంకారంతో వైకాపా నేతలకు కళ్లు నెత్తికెక్కాయి. ఇది కూటమి ప్రభుత్వం.. వైకాపా రాజ్యం అనుకుంటున్నారా.. ఖబడ్దార్. ఇష్టారాజ్యంగా చేయలేరు. మీ అహంకారం ఎలా అణచివేయాలో మాకు తెలుసు. చేసి చూపిస్తాం. అధికారులపై దాడి చేస్తే తోలు తీస్తాం" అని పవన్ హెచ్చరించారు. పులివెందుల నియోజకవర్గంలో ఓ రైతు కుటుంబం ఆత్మహత్యపై పవన్ స్పందించారు. ఆ ఘటన బాధాకరమని.. దీనిపై విచారణ జరుగుతోందని పేర్కొన్నారు. రెండ్రోజుల క్రితం రైతు తన భూమి మ్యుటేషన్ పెట్టుకున్నారని.. ఎలాంటి పరిస్థితుల్లో ఈ ఘటన జరిగిందో నివేదిక వచ్చాక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# నేను ఈ వ్యక్తికి అభిమానిని అయ్యాను

## .. వైరల్ వీడియో షేర్ చేసిన లోకేశ్

సోషల్ మీడియాలో వైరల్ అవుతోన్న వీడియోను నారా లోకేశ్ షేర్ చేశారు. ఆ వీడియోలోని వ్యక్తికి తాను అభిమానిగా మారినట్లు తెలిపారు.



డిసెంబర్ 28, (రిపబ్లిక్ న్యూస్): సోషల్ మీడియాలో వైరలయ్యే వీడియోలు ప్రముఖులను ఆకర్షిస్తుంటాయి. తాజాగా ఏపీ సీఎం చంద్రబాబుని ఇమిటేట్ చేసిన ఓ వ్యక్తి వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయిన విషయం తెలిసిందే. ఈ వీడియో మంత్రి లోకేశ్ వరకూ చేరింది. ఆయన దీన్ని షేర్ చేశారు. 'నేను ఇతడికి అభిమానిగా మారిపోయాను. చంద్రబాబుగారిలా మాట్లాడడానికి, కనిపించడానికి అతడు ఎంత కష్టపడ్డాడో చూడండి' అని ఆ వీడియోను షేర్ చేశారు. ఇటీవల జరిగిన ఓ పెళ్లి వేడుకలో మిమిక్రీ ఆర్టిస్టు ఒకరు అచ్చం చంద్రబాబులా వేషధారణలో హాజరయ్యారు. వేదికపైకి వచ్చి ఆయనలానే మాట్లాడి వధూవరులను ఆశీర్వదించారు. ఆయనలానే మాట్లాడి అక్కడున్న వారందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ వీడియో రెండురోజుల నుంచి సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. దీన్ని ఓ అభిమాని షేర్ చేసి 'వామ్మో.. సడెన్గా చూసి మా పెద్దాయన అనుకున్నా. సేమ్ బాబుగారి లానే ఉన్నారు' అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆ పోస్టును షేర్ చేస్తూ లోకేశ్ కూడా ఆశ్చర్యానికి గురి కావడం అందరినీ ఆకర్షిస్తోంది.

# మన్మోహన్ కు తుది వీడ్కోలు.. ముగిసిన మాజీ ప్రధాని అంత్యక్రియలు

భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు ముగిశాయి. ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.






ఢిల్లీ, డిసెంబర్ 28, (రిపబ్లిక్ న్యూస్): అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు ముగిశాయి. ఢిల్లీలోని నిగమ్ బోధ్ ఘాట్లో ఆయన పార్థివదేహానికి ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ పాడె మోశారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగీప్ ధనఖడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, లోక్సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్నాథ్ సింగ్, జేపీ నడ్డా, కిరణ్ రిజిజు, కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా హాజరై మాజీ ప్రధానికి తుది వీడ్కోలు పలికారు. త్రివిధ దళాల అధిపతులు మన్మోహన్కు నివాళులర్పించారు. అంత్యక్రియలకు ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ, తెలంగాణ సీఎం రేవంత్రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హాజరయ్యారు. భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యల్ వాంగ్చుక్, విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు. మన్మోహన్ (పార్థివదేహాన్ని పార్టీ నేతలు, కార్యకర్తల సందర్శనార్థం శనివారం ఉదయం ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి తీసుకువచ్చారు. కాంగ్రెస్ నేతలు రాహుల్, సోనియా, ప్రియాంక గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, ఎంపీ మల్లు రవి తదితరులు నివాళులర్పించారు. తర్వాత అక్కడినుంచి నిగమబోధ్ ఘాట్ వరకు అంతిమయాత్ర కొనసాగింది. ఈ సమయంలో రాహుల్.. మన్మోహన్ కుటుంబం వెన్నంటే ఉన్నారు. 92 ఏళ్ల మన్మోహన్ సింగ్ వయసురీత్యా తలెత్తిన అనారోగ్య సమస్యలతో గురువారం రాత్రి ఇంటివద్ద అకస్మాత్తుగా స్పృహ కోల్పోయారు. దీంతో కుటుంబసభ్యులు ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మన్మోహన్ పదేళ్ల పాటు దేశానికి ప్రధానిగా పని చేశారు. అంతకుముందు ఆర్బీఐ గవర్నర్గా వ్యవహరించారు. ప్రధానిగా పీవీ నరసింహారావు హయాంలో ఆర్థిక మంత్రిగానూ బాధ్యతలు నిర్వర్తించారు. అంతకుముందు మన్మోహన్ సింగ్ మృతికి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సంతాపం తెలిపారు. మాజీ ప్రధాని సతీమణి గురుశరణ్ సింగ్, కుటుంబసభ్యులకు బైడెన్ దంపతులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈమేరకు వైట్ హౌస్ ఓ ప్రకటన విడుదల చేసింది.

# బొకేలకు బదులుగా పుస్తకాలు ఇవ్వండి

## : గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

శుభ కార్యాలకు వెళ్లినప్పుడు బొకేలకు బదులుగా పుస్తకాలు ఇవ్వాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు.



హైదరాబాద్, డిసెంబర్ 28, (రిపబ్లిక్ న్యూస్): శుభకార్యాలకు వెళ్లినప్పుడు బొకేలకు బదులుగా పుస్తకాలు ఇవ్వాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు. శనివారం ఆయన హైదరాబాద్ బుక్ ఫెయిర్ను సందర్శించి మాట్లాడారు. "పుస్తకాల్లో అనంతమైన జ్ఞానం ఉంది. నిరక్షరాస్యుల కోసం ఆడియో బుక్స్ కూడా అందుబాటులోకి వచ్చాయి. పుస్తకాలను నమిలి మింగేయాలనేంత క్షుణ్ణంగా చదవాలి. హైదరాబాద్ బుక్ ఫెయిర్ సంప్రదాయబద్ధంగా పుస్తకాల్ని ప్రమోట్ చేస్తోంది. మానవ నాగరికత వర్థిల్లినంతకాలం పుస్తకాలు ఉంటాయి. ఈ-బుక్స్ కంటే పుస్తకాల్లోనే మజా ఉంటుంది. రచయితతో డైరెక్టా మాట్లాడుతున్నట్టు ఉంటుంది. విశ్వం గురించి తెలియాలంటే పుస్తకాలు చదవాల్సిందే. ఈ-పుస్తకాలు చదివితే ఆ ఫీల్ ఉండదని పలువురు చెబుతున్న మాట. పెద్దలు అందరూ యువతను పుస్తకాల వైపు ప్రోత్సహించాలి" అని గవర్నర్ సూచించారు.

# కొత్త సంవత్సరం వేళ.. చలో అయోధ్య

## .. హోటల్స్ అన్నీ ఫుల్

భక్తులతో అయోధ్య నగరి కిటకిటలాడనుంది. కొత్త సంవత్సరం, బాలరాముడి ప్రాణప్రతిష్ఠ జరిగి ఏడాది కావొస్తుండటంతో పర్యటకులు పోటెత్తనున్నారు.



డిసెంబర్ 28, (రిపబ్లిక్ న్యూస్): కొత్త సంవత్సరం వేళ అయోధ్య నగరం పర్యటకులతో కళకళలాడనుంది. నూతన ఏడాదిలోకి అడుగుపెట్టడం, అలాగే బాలరాముడు కొలువుదీరి సంవత్సరం పూర్తి కావొస్తుండటంతో భారీగా భక్తులు తరలిరానున్నారు. దాంతో ఎలాంటి నిర్వహణ లోపాలు తలెత్తకుండా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే దర్శన వేళలు పెంచుతూ రామ జన్మభూమి తీర్థక్షేత్రట్రస్ట్ నిర్ణయం తీసుకుంది."భక్తులకు స్వాగతం పలికేందుకు అంతా సిద్ధంగా ఉంది. జనవరి 15 వరకు హోటల్ గదులన్నీ ముందుగానే బుక్ అయ్యాయి" అని స్థానిక హోటల్ యజమాని అంకిత్ మిశ్రా వెల్లడించారు. చాలా తక్కువ సంఖ్యలో మాత్రమే గదుల లభ్యత ఉందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇదే అదనుగా కొందరు హోటళ్ల యజమానులు ఒక్కరోజుకు రూ.10వేల వరకు వసూలు చేస్తున్నట్లు వెల్లడించాయి. "రాముడి ఆలయం, హనుమాన్గఢి, లతాచౌక్, గుప్తర్ ఘాట్, సూరజ్కుండ్, ఇతర ప్రఖ్యాత స్థలాల వద్ద భారీగా భద్రతా ఏర్పాటు చేశాం" అని అయోధ్య పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. ఈ ఏడాది జనవరి 22న అయోధ్య రామమందిరం లో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ అత్యంత వైభవంగా జరిగిన సంగతి తెలిసిందే. ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా బాలరాముడికి గర్భగుడిలో ప్రాణప్రతిష్ఠ శాస్త్రోక్తంగా జరిగింది. ఆ వేడుకకు దేశ, విదేశాల్లోని అత్యంత ప్రముఖులు, స్వామీజీలు కలిపి దాదాపు 7 వేల మంది విచ్చేశారు. రాజకీయ, సినీ, క్రీడా రంగానికి చెందిన ప్రముఖులు ప్రాణప్రతిష్ఠ వేడుకను ప్రత్యక్షంగా వీక్షించి పులకించిపోయారు. అయోధ్య, వారణాసి ఆలయాలను దర్శించుకునే భక్తుల కారణంగా.. ఉత్తరప్రదేశ్కు పర్యటకులు భారీగా తరలివస్తుంటారు. "రామ మందిర ప్రారంభం తర్వాత మొదటి ఆరు నెలల్లో యూపీకి పర్యటకుల రాక గణనీయంగా పెరిగింది. ఒక జనవరిలోనే రికార్డు స్థాయిలో ఏడుకోట్లమంది సందర్శించారు" అని ఇటీవల యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

# సాంకేతికతతో నేరాలకు అడ్డుకట్ట : డీజీపీ ద్వారకా తిరుమలరావు

విజయవాడలోని పోలీస్ కమాండ్ కంట్రోల్ తో 2025 మార్చి 31 నాటికి లక్ష సీసీ కెమెరాలు అనుసంధానిస్తామని ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు వెల్లడించారు.



అమరావతి, డిసెంబర్ 28, (రిపబ్లిక్ న్యూస్): విజయవాడలోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ 2025 మార్చి 31 నాటికి లక్ష సీసీ కెమెరాలు అనుసంధానిస్తామని ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో ఇప్పటికే 25 వేలకు పైగా సీసీ కెమెరాలను నేర నియంత్రణకు వినియోగిస్తున్నామన్నారు. గతంతో పోలిస్తే సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. ఈ ఏడాదిలో సైబర్ క్రైమ్కు సంబంధించి 916 కేసులు నమోదు కాగా.. సుమారు రూ.1,229 కోట్ల మేర నగదును సైబర్ నేరగాళ్లు కాజేశారని పేర్కొన్నారు. డిజిటల్ అరెస్టు అనేది లేదని.. అలాంటి కాల్సును ప్రజలు నమ్మొద్దన్నారు."కొత్తగా ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నాం. గంజాయి, డ్రగ్స్ కేసుల వ్యవహారంలో 'ఈగల్' వ్యవస్థ ప్రజల్లోకి బలంగానే వెళ్లోంది. 10,380 ఎకరాల్లో గంజాయి పంటను ధ్వంసం చేసి ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాల్సిందిగా గిరిజనులకు అవగాహన కల్పిస్తున్నాం. స్మార్ట్ పోలీసింగ్ లో భాగంగా దేశంలోనే తొలిసారి ఏపీలో 'స్మార్ట్ పోలీస్ ఏఐ' వ్యవస్థను వినియోగిస్తున్నాం. ప్రస్తుతం ఏలూరు జిల్లా పోలీసులు ఈ స్మార్ట్ పోలీస్ ఏఐను అమలు చేస్తున్నారు. కేసు నమోదు నుంచి విచారణ వరకూ ఈ స్మార్ట్ పోలీస్ ఏఐ విచారణాధికారికి సహకరిస్తుంది. ట్రాఫిక్, క్రౌడ్ మేనేజ్మెంట్ కోసం విజయవాడ పోలీసులు 'ఏఐ వజ్రాస్త్రం' పేరిట ఏఐ సాంకేతికత వినియోగిస్తున్నారు" అని డీజీపీ తెలిపారు."డిప్యూటీ సీఎం భద్రతా వలయంలోకి నకిలీ ఐపీఎస్ రావడంపై విచారణ చేస్తున్నాం. అది భద్రతాపరమైన లోటు కాదని భావిస్తున్నాం. భూకబ్జాలు, ఇసుక అక్రమ తవ్వకాలు, రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడేవారిపై పీడీ యాక్టు నమోదు చేస్తున్నాం. సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టుల వ్యవహారంపై ఇప్పటివరకూ 572 కేసులు నమోదయ్యాయి. ఈ తరహా కేసుల్లో నిందితులపై రౌడీషీట్, సైబర్ షీట్లను నమోదు చేస్తున్నాం" అని డీజీపీ వెల్లడించారు.

# యువ క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డికి ప్రోత్సాహకం ప్రకటించిన ఏసీఏ

ఏసీఏ తరపున యువ క్రికెటర్ నితీశ్ కుమార్‌రెడ్డికి ఏసీఏ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ రూ.25 లక్షల నగదు బహుమతి ప్రకటించారు.



విజయవాడ, డిసెంబర్ 28, (రిపబ్లిక్ న్యూస్): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) తరపున యువ క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డికి ఏసీఏ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ రూ.25 లక్షల నగదు బహుమతి ప్రకటించారు. ఇండియన్ క్రికెట్ టీమ్కు సెలెక్ట్ అయిన నితీశ్కు అభినందనలు తెలిపారు. త్వరలోనే సీఎం చేతుల మీదుగా నగదు బహుమతిని అందిస్తామన్నారు.బోర్డర్-గావస్కర్ ట్రోఫీ నాలుగో టెస్టులో ఆల్రౌండర్గా నితీశ్ అద్భుతంగా రాణిస్తున్నాడని వ్యాఖ్యానించారు. ఇలాంటి యువ క్రికెటర్లను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని.. నేటి యువతకు నితీశ్ రోల్ మోడల్ అన్నారు. దేశంలోనే అత్యాధునిక వసతులతో కూడిన స్టేడియంను అమరావతిలో నిర్మిస్తామని పేర్కొన్నారు. ఐపీఎల్ మ్యాచ్లు ఆడే విధంగా విశాఖపట్నం స్టేడియంను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కూడా ఐపీఎల్ టీమ్ సిద్ధం చేసేలా ఏసీఏ ఆలోచన చేస్తోందన్నారు.

# ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై సమీక్ష

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఇరవై సూత్రాల కార్యక్రమం కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ శనివారం విజయనగరం కలెక్టరేట్లో జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులతో ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు.

విజయనగరం, డిసెంబర్ 28, (రిపబ్లిక్ న్యూస్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఇరవై సూత్రాల కార్యక్రమం కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ శనివారంవిజయనగరం కలెక్టరేట్లో జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులతో ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలపై ఆయన కలెక్టర్ అంబేద్కర్తో పాటు జిల్లా అధికారులతో మాట్లాడారు. ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతి రాజు,ఎం.ఎల్.సి. రఘు రాజు, మహిళా ఆర్థిక సహకార సంస్థ ఛైర్ పర్సన్ కావలి గ్రీష్మ, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగారు రాజు,ఆర్.టి.సి ప్రాంతీయ ఛైర్మన్ దున్ను దొర, తూర్పు కాపు కార్పొరేషన్ ఛైర్మన్ పాలవలస యశస్విని, జిల్లా అధికారులు పాల్గొన్నారు. **సైనిక్ స్కూల్ను సందర్శించిన పూర్వ విద్యార్థులు:** విజయనగరం కోరుకొండ సైనిక్ స్కూల్ 1999-2006 బ్యాచ్ పూర్వ విద్యార్థులు శనివారం సైనిక్ స్కూల్ ను సందర్శించి ఆనందం వ్యక్తం చేశారు. పూర్వ విద్యార్థులు చదివిన తరగతి గదులు ఆటలాడుకున్న క్రీడామైదానం చూసుకొని విద్యార్థులుగా మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆనందంగా స్నేహితులతో గడిపారు. ప్రిన్సిపల్ గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి తో పాటు అధ్యాయపకులను పూర్వ విద్యార్థుల ఘనంగా సన్మానించారు.

# తెలుగు భాష పలుకుబడి వినసొంపైనది .. సంగీతంలా ఉంటుంది: జస్టిస్ ఎన్వీ రమణ

విజయవాడలో జరుగుతున్న ప్రపంచ తెలుగు రచయితల ఆరో మహాసభల్లో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ పాల్గొని ప్రసంగించారు.



విజయవాడ, డిసెంబర్ 28, (రిపబ్లిక్ న్యూస్): "తెలుగు భాషను కాపాడుకుందాం. ఆత్మాభిమానాన్ని పెంచుకుందాం అనే నినాదంతో ఐక్యత చాటేందుకు నలుమూలల నుంచి విజయవాడ తరలివచ్చిన వారందరికీ వందనాలు" అని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. విజయవాడలో జరుగుతున్న ప్రపంచ తెలుగు రచయితల ఆరో మహాసభల్లో పాల్గొని ఆయన ప్రసంగించారు."తెలుగు తల్లి ముద్దుబిడ్డ, మహోన్నత వ్యక్తి, తుది శ్వాస వరకూ తెలుగు భాష, సంప్రదాయాల పరిరక్షణ కోసం పోరాడిన యోధుడు రామోజీరావు సభా వేదిక నుంచి మిమ్మల్నందర్నీ చూస్తుంటే.. యావత్ తెలుగు ప్రపంచం నా ముందు సాక్షాత్కరిస్తోంది. విశ్వవ్యాప్తంగా ఉన్న తెలుగువారు మన సంస్కృతి, భాషను మరిచిపోకూడదని.. తెలుగు జాతి కీర్తి ప్రతిష్ఠలు నిత్యం వెలుగొందాలని కోరుకునే వ్యక్తిని నేను. తెలుగు భాషను దేశంలో వంద మిలియన్లకు పైగా మాట్లాడతారు. తెలుగుభాష పలుకుబడి వినసొంపైనది. అది సంగీతంలా ఉంటుంది. సామాన్య ప్రజలు కూడా కవితా ధోరణిలో మాట్లాడగలిగే అందమైన భాష తెలుగు. ఇంత అద్భుతమైన మన తల్లి భాష తెలుగును.. వ్యాపార, రాజకీయ ప్రయోజనాల కోసం వేరే భాష, సంస్కృతి వచ్చి కొల్లగొట్టడాన్ని మనం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరాదు" "తెలుగు భాషా, సంసృతిని పరిరక్షించుకున్నప్పుడే మనం గొప్పవారమవుతాం. జాతి మనుగడకు, వికాసానికి ధైర్యం కావాలి. భాష లేకపోతే.. ఎన్ని ఉన్నా చరిత్ర లేని అనాథలం, అక్షరం లేని అభాగ్యులం. మన సంస్కృతి, భాష చిరకాలం నిలిచి ఉండేలా.. శ్రీశ్రీ, ఆరుద్ర, విశ్వనాథ సత్యనారాయణ, సినారెలాంటి గొప్ప రచయితలు.. భానుమతి, సూర్యకాంతం, జమున, సావిత్రి, గుమ్మడి, జగ్గయ్య, అక్కినేని, ఎన్టీఆర్, రేలంగి, ఎస్వీఆర్, ఘంటసాల, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఇలా ఎందరెందరో దిగ్గజాల ఘనమైన వారసత్వం మనది. ఈ వారసత్వం మరవకండి. మీరు గుర్తుంచుకోండి.. మీ పిల్లలకు గుర్తు చేయండి. భాష అనేది భావ వ్యక్తీకరణకు ఒక సాధనం. ప్రస్తుత కర్తవ్యం అభివృద్ధితోపాటు.. భాషా సంస్కృతులను మనం రక్షించుకోవాలి" అని జస్టిస్ ఎన్వీ రమణ పిలుపునిచ్చారు.

# ఫార్ములా ఈ-రేసు కేసు.. కేటీఆర్ కు ఈడీ నోటీసులు

ఫార్ములా ఈ-రేసు కేసులో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కు ఈడీ నోటీసులు ఇచ్చింది.



హైదరాబాద్, డిసెంబర్ 28, (రిపబ్లిక్ న్యూస్): ఫార్ములా ఈ-రేసు కేసులో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కు ఈడీ నోటీసులు ఇచ్చింది. జనవరి 7న విచారణకు రావాలని అందులో పేర్కొన్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్కు, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డికి కూడా ఈడీ నోటీసులు ఇచ్చింది. జనవరి 2, 3న విచారణకు రావాలని అరవింద్, బీఎల్ఎన్ రెడ్డికి ఇచ్చిన నోటీసుల్లో పేర్కొన్నారు. ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా పీఎంఎల్ఏ కింద ఈడీ విచారణ చేస్తోంది.

# పవన్ కల్యాణ్ పర్యటనలో నకిలీ ఐపీఎస్ అధికారి

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు, మక్కువ మండలం బాగోజాలలో పర్యటించారు.



విజయనగరం, డిసెంబర్ 28, (రిపబ్లిక్ న్యూస్): ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు, మక్కువ మండలం బాగోజాలలో పర్యటించారు. ఈ పర్యటనలో నకిలీ ఐపీఎస్ అధికారి పాల్గొన్నట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నకిలీ ఐపీఎస్ అవతారం ఎత్తిన వ్యక్తిని విజయనగరం జిల్లా గరివిడికి చెందిన మాజీ సైనికుడు సూర్యప్రకాష్గా అనుమానిస్తున్నారు. దీనిపై పోలీసు అధికారులు విచారణ చేపట్టారు.

# రామోజీరావుకు గుర్తుగా ఇక నుంచి శుభోదయం అని పలకరించుకుందాం: శైలజా కిరణ్

ఇక నుంచి ప్రతి ఇంట్లో మనమంతా శుభోదయం అని పలకరించుకుందామని మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్ అన్నారు.



విజయవాడ, డిసెంబర్ 28, (రిపబ్లిక్ న్యూస్): దేశంలో అత్యధిక ప్రజలు మాట్లాడే నాలుగో భాష తెలుగు అని మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్ అన్నారు. ఆంగ్ల భాష మాట్లాడితేనే గొప్ప అనే అభిప్రాయం తప్పు అని తెలిపారు. ప్రపంచ తెలుగు రచయితల ఆరో మహాసభలు విజయవాడలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సభలో శైలజా కిరణ్ మాట్లాడుతూ మాతృభాష గొప్పతనాన్ని వివరించారు."దేశంలో అత్యధిక ప్రజలు మాట్లాడే నాలుగో భాష తెలుగు. ప్రపంచంలో అత్యధిక ప్రజలు మాట్లాడే 14వ భాష మన తెలుగు. కవిత్రయం వంటి కవుల కారణంగా తెలుగుకు ప్రాచుర్యం వచ్చింది. దేశభాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణ దేవరాయలు ప్రశంసించారు. తెలుగు భాషా.. సంగీతమా అని రవీంద్రుడు మెచ్చుకున్నారు" అని శైలజా కిరణ్ తెలిపారు."రామోజీరావుకు తెలుగు భాషన్నా.. తెలుగు రాష్ట్రాలన్నా ఎంతో ఇష్టం. ఉదయం ఆయన్ను పలకరించగానే శుభోదయం అనే చెప్పేవారు. మేమంతా ఇంట్లో ఉదయం శుభోదయం అనే పలకరించుకునేవాళ్లం. మా ఇంట్లో పిల్లలు తెలుగు మాట్లాడేలా రామోజీరావు గారు ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవారు. ఆయనకు గుర్తుగా ఇకపై మనమంతా శుభోదయం అనే పలకరించుకుందాం. మనది అని అనుకునేదాన్ని మనం చాలా జాగ్రత్తగా చూసుకుంటాం. కాపాడుకుంటాం. అలాగే తెలుగు భాష మనందరిది. చాలా ముఖ్యమైనది. అందుకే మనమంతా కలసికట్టుగా మన భాషాభివృద్ధి కోసం కృషి చేద్దాం" అని ఆమె పిలుపునిచ్చారు.

# ఎంపీడీవో జవహర్ బాబుపై దాడి ఘటన ..13 మందిపై కేసు

అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబు పై దాడి ఘటనలో పోలీసులు 13 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.



గాలివీడు, డిసెంబర్ 28, (రిపబ్లిక్ న్యూస్): అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబు పై దాడి ఘటనలో పోలీసులు 13 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. వీరిలో ప్రధాన నిందితుడు, వైకాపా నేత సుదర్శన్ రెడ్డి ఉన్నారు. ఎంపీడీవో జవహర్ బాబు ఫిర్యాదు మేరకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే ప్రధాన నిందితుడు సుదర్శన్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు.గాలివీడు ఎంపీపీ పద్మావతమ్మ కుమారుడు, వైకాపా లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్రెడ్డి 20 మంది అనుచరులతో కలిసి శుక్రవారం ఉదయం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారు. ఎంపీపీ ఛాంబర్ తాళం ఇవ్వాలని అడగ్గా.. ఎంపీపీకి మాత్రమే ఛాంబర్ తాళాలు ఇస్తామని ఎంపీడీవో స్పష్టం చేశారు. మాకే ఎదురు చెబుతావా? అంటూ జవహర్ బాబుపై సుదర్శన్ రెడ్డి, అతని అనుచరులు ఒక్కసారిగా దాడికి దిగారు. కుర్చీలో నుంచి కిందపడిపోయినా ఆగకుండా కాళ్లతో తన్నుతూ పిడిగుద్దులు గుద్దారు. తీవ్రంగా గాయపడిన ఎంపీడీవో జవహర్ బాబును పోలీసులు రాయచోటి ఆసుపత్రికి తరలించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు సుదర్శన్రెడ్డిని అదుపులోకి తీసుకుని ఎస్పీ కార్యాలయానికి తరలించారు. దాడిలో పాల్గొన్న అతని అనుచరుల కోసంగాలిస్తున్నారు

# హైడ్రాకు ఇప్పటివరకు 5,800 ఫిర్యాదులు అందాయి : కమిషనర్ రంగనాథ్

హైడ్రా ఇప్పటికే 200 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడిందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు.




హైదరాబాద్, డిసెంబర్ 28, (రిపబ్లిక్ న్యూస్): హైడ్రా ఇప్పటికే 200 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడిందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హైడ్రా వార్షిక నివేదికను రంగనాథ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ.. హైడ్రా చర్యల వల్ల ఎన్టీఎల్, బఫర్ జోన్లు, అక్రమ నిర్మాణాలపై ప్రజల్లో అవగాహన పెరిగిందన్నారు."హైడ్రా ఇప్పటివరకు 8 చెరువులు, 12 పార్కులను కాపాడింది. సాంకేతిక పరిజ్ఞానంతో చెరువులకు సరిహద్దులు, బఫర్ జోన్ లు నిర్ణయిస్తున్నాం. ఎస్ఆర్ఎస్ఈతో సమన్వయం చేసుకుని శాటిలైట్ చిత్రాలు సేకరిస్తున్నాం. ఏరియల్ డ్రోన్ చిత్రాలు కూడా తీసుకుంటాం. ప్రభుత్వ భూములకు జియో ఫెన్సింగ్ చేసేందుకు చర్యలు చేపట్టాం. చెరువులకు సంబంధించి 2000 నుంచి 2024 వరకు ఉన్న చిత్రాలు సేకరిస్తున్నాం. హైడ్రాకు ఇప్పటివరకు 5,800 ఫిర్యాదులు అందాయి" అని రంగనాథ్ తెలిపారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



# చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1612:** ఖగోళ శాస్త్రవేత్త గెలీలియో మొట్టమొదట నెప్ట్యూన్ గ్రహాన్ని పరిశీలించాడు. (చిత్రంలో)
- **1875:** పండితులు, కవి బెల్లంకొండ రామరాయ కవీంద్రుడు జననం (మ.1914).
- **1921:** మొదటిసారి వందేమాతరం గీతాన్ని కలకత్తా కాంగ్రెసు సభల్లో పాడారు.
- **1932:** భారత పారిశ్రామికవేత్త ధీరుభాయ్ అంబానీ జననం (మ.2002).
- **1932:** భారత మిమిక్రీ కళాకారుడు నేరెళ్ళ వేణుమాధవ్ జననం.(మ.2018)
- **1937:** భారత పారిశ్రామికవేత్త రతన్ టాటా జననం.
- **1954:** అమెరికన్ నటుడు, సినీరచయిత, దర్శకుడు, చిత్ర నిర్మాత డెంజెల్ వాషింగ్టన్ జననం.
- **1969:** అమెరికా సాఫ్ట్‌వేర్ ఇంజనీరు, హ్యాకర్, ఓపెన్ సోర్సు లినక్స్ కెర్నల్ అభివృద్ధికారుడు లినస్ టోర్వాల్డ్స్ జననం.


గెలీలియో


రామరాయ కవీంద్రుడు


వందేమాతరం


ధీరుభాయ్ అంబానీ


వేణుమాధవ్


రతన్ టాటా



డెంజెల్ వాషింగ్టన్


లినస్ టోర్వాల్డ్స్

రిపబ్లిక్ సినిమా CINEMA

# కేరళలో రికార్డు బద్దలు కొడుతున్న 'మార్కో'.. తెలుగు ట్రైలర్

హనీఫ్ దర్శకత్వంలో ఉన్ని ముకుందన్ కథానాయకుడిగా నటించిన 'మార్కో' మూవీ తెలుగు ట్రైలర్ విడుదలైంది.

ఉన్ని ముకుందన్ కథానాయకుడిగా హనీఫ్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ 'మార్కో'. ఇటీవల మలయాళంలో విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తోంది. రూ.30కోట్లతో నిర్మించిన ఈ చిత్రం విడుదలైన వారంలో రోజుల్లోనే రూ.80కోట్లకు పైగా వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు లెక్కగట్టాయి. ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 1న ఈ చిత్రం విడుదల కానుంది. తాజాగా చిత్ర ట్రైలర్ విడుదలైంది. యాక్షన్ సన్నివేశాలను పెద్ద పీట వేసినట్లు ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతోంది.






# 'సల్మాన్, మీరు డేట్ చేశారా? : నటిని ప్రశ్నించిన నెటిజన్

బాలీవుడ్ నటి ప్రీతి జింటా కు ఊహించని ప్రశ్న ఎదురైంది. సల్మాన్ ఖాన్ కు శుభాకాంక్షలు చెబుతూ ఆమె పోస్ట్ పెట్టగా.. ఆయనతో డేట్లో ఉన్నారా? అని ఓ నెటిజన్ ప్రశ్నించాడు.

బాలీవుడ్ నటి ప్రీతి జింటా కు ఊహించని ప్రశ్న ఎదురైంది. సల్మాన్ ఖాన్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం ఆమె ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. దీనిపై ఓ నెటిజన్ స్పందిస్తూ.. "మీ ఇద్దరూ ఎప్పుడైనా డేట్లో ఉన్నారా?" అని ప్రశ్నించాడు. దీనిపై ఆమె తనదైన శైలిలో బదులిచ్చారు. సల్మాన్ తనకు కుటుంబసభ్యుడితో సమానం అని స్పష్టంచేశారు."మేమిద్దరం అస్సలు డేట్ చేయలేదు. తను నాకు కుటుంబసభ్యుడితో సమానం. అలాగే నా భర్తకూ అతను మంచి స్నేహితుడు. నా సమాధానంతో మీరు ఆశ్చర్యానికి గురైతే నన్ను క్షమించండి" అని తెలిపారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్గా మారింది. నెటిజన్ తీరుపై పలువురు అసహనం వ్యక్తంచేశారు. పెళ్లైన తర్వాత ఒక నటిని ఇలాంటి ప్రశ్నలు వేయడం ఏమాత్రం సరికాదని హితవు పలికారు. అలాగే నటిని మెచ్చుకుంటున్నారు.1998లో విడుదలైన 'దిల్ సే'తో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు ప్రీతి జింటా. ఎన్నో ప్రేమకథా చిత్రాల్లో యాక్ట్ చేసి సినీప్రియుల మది దోచారీ నటి. 'ప్రేమంటే ఇదేరా', 'రాజ కుమారుడు' వంటి చిత్రాలతో తెలుగువారికి చేరువయ్యారు. 2018లో విడుదలైన 'భయాజీ సూపర్హిట్' తర్వాత ఆమె సినిమాలకు దూరంగా ఉన్నారు. ప్రస్తుతం 'లాహెూర్ 1947' కోసం వర్క్ చేస్తున్నారు.'హర్ దిల్ జో ప్యార్ కరేగా', 'చోరీ చోరీ చుప్కే చుప్కే' వంటి హిందీ చిత్రాలతో ఆన్లైన్ జోడీగా మంచి పేరు తెచ్చుకున్నారు ప్రీతి జింటా, సల్మానాఖాన్. ఆయా చిత్రాల వల్ల వీరి మధ్య మంచి స్నేహం ఏర్పడింది. ఈ క్రమంలోనే సల్మాన్ పుట్టినరోజును పురస్కరించుకొని ప్రతి ఏడాది ఆమె విషెస్ తెలుపుతుంటారు. శుక్రవారం (సల్మాన్ ఖాన్ పుట్టినరోజు డిసెంబర్ 27) కూడా అదేవిధంగా పోస్ట్ పెట్టారు. పలు సందర్భాల్లో ఆయనతో దిగిన ఫొటోలను ఆమె షేర్ చేశారు."హ్యాపీ బర్త్డే సల్మాన్. లవ్ యూ మోస్ట్. మిగిలిన విషయాలు మనం కలిసినప్పుడు చెబుతా. మనం కలిసి ఎన్నో ఫొటోలు దిగాలి. లేదంటే ఆ పాత ఫొటోలనే నేను ప్రతిసారీ పోస్ట్ చేస్తా" అని సరదాగా తెలిపారు. ఈ ఫొటోలు సినీప్రియుల దృష్టిని ఆకర్షించాయి.

# అభిమానుల తీరుపై పవన్ కల్యాణ్ అసహనం

అభిమానుల తీరుపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, నటుడు పవన్ కల్యాణ్ అసహనం వ్యక్తంచేశారు.

అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబుపై దాడి జరిగిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కడప రిమ్స్ చికిత్స పొందుతున్న ఆయన్ని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరామర్శించి దాడి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పవన్ మీడియాతో మాట్లాడుతూ ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. బాధ్యులను వదిలిపెట్టమని హెచ్చరించారు.ఇదిలాఉండగా, పవన్ని చూసేందుకు అక్కడికి వచ్చిన పలువురు అభిమానులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆయన సీరియస్ మీడియాతో మాట్లాడుతున్న సమయంలో 'ఓజీ.. ఓజీ.. ఓజీ' అంటూ స్లోగన్లు చేశారు. దీనిపై ఆయన ఆగ్రహానికి గురయ్యారు. "ఏంటయ్యా మీరు. ఎప్పుడు ఏ స్లోగన్ ఇవ్వాలో మీకు తెలియదు. పక్కకు రండి" అంటూ తన అసహనాన్ని తెలియజేశారు.పవన్కల్యాణ్ ప్రస్తుతం రాజకీయాల్లో ఎంతో బిజీగా ఉన్నారు. వరుస మీటింగ్స్, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. మరోవైపు, దర్శక నిర్మాతలకు ఇబ్బందులు కలగకుండా ఇప్పటికే పట్టాలెక్కించిన సినిమాలను పూర్తిచేస్తున్నారు. తన తదుపరి చిత్రాలు 'ఓజీ', 'హరిహర వీరమల్లు' షూట్స్ లో వీలు కుదిరినప్పుడు పాల్గొంటున్నారు. సుజీత్ దర్శకత్వంలో ఆయన నటిస్తోన్న చిత్రమే 'ఓజీ'. యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్ గా ఇది సిద్ధమవుతోంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై దానయ్య నిర్మిస్తున్నారు.



రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

# నితీశ్ రెడ్డి సిక్సర్ల రికార్డు.. ఆస్ట్రేలియాలో తొలి భారత బ్యాటర్ గా


మెల్ బోర్న్‌లో ఆస్ట్రేలియాతో జరుగుతున్న నాలుగో టెస్టులో నితీశ్ కుమార్ రెడ్డి సెంచరీతో అదరగొట్టాడు.




ఆస్ట్రేలియాతో జరుగుతున్న బోర్డర్-గావస్కర్ ట్రోఫీ లో తెలుగు కుర్రాడు నితీశ్కుమార్ రెడ్డి అద్భుతమైన ఆటతీరు కనబరుస్తున్నాడు. క్లిష్ట సమయాల్లో కీలక ఇన్నింగ్స్ ఆడుతూ జట్టుకు ఆపద్బాంధవుడిలా మారుతున్నాడు. మెల్బోర్న్ వేదికగా జరుగుతున్న బాక్సింగ్ డే టెస్టులో ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్కు వచ్చి నితీశ్ (105లిబీ 176 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్) శతకం బాదేశాడు. దీంతో టీమిండియా ఫాలోఆన్ గండం నుంచి గట్టెక్కింది. తొలి ఇన్నింగ్స్లో ఒక సిక్సర్ బాది ఈ పర్యటనలో ఎనిమిది సిక్సర్లు పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలోనే ఆస్ట్రేలియాలో ఒక టెస్టు సిరీస్లో అత్యధిక సిక్సర్లు బాదిన తొలి భారత బ్యాటర్గా రికార్డు సృష్టించాడు. నితీశ్ కంటే ముందు విదేశీ బ్యాటర్లలో మైకేల్ వాన్ (2022-03), క్రిస్ గేల్ (2009-10) ఈ ఘనత సాధించారు. ఈ సెంచరీతో నితీశ్ మరో రికార్డు కూడా అందుకున్నాడు. ఆస్ట్రేలియా గడ్డపై 8వ స్థానంలో వచ్చి అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్గా నిలిచాడు. ఇంతకుముందు స్పిన్ దిగ్గజం అనిల్ కుంబ్లే (87) పేరిట ఈ రికార్డు ఉండేది. ఇప్పుడు దానిని అధిగమించాడు.ఈ సెంచరీ ఎప్పటికీ గుర్తుండిపోతుంది: వాషింగ్టన్ సుందర్ మెల్బోర్న్ నితీశ్ సాధించిన సెంచరీ ఎప్పటికీ గుర్తుండిపోతుందని భారత స్పిన్ ఆల్రౌండర్ వాషింగ్టన్ సుందర్ అన్నాడు. నితీశ్తోపాటు సుందర్ (50బీ 162 బంతుల్లో) కూడా కీలక ఇన్నింగ్స్ ఆడిన విషయం తెలిసిందే. తొమ్మిదో స్థానంలో వచ్చిన సుందర్ నితీశ్తో కలిసి ఎనిమిదో వికెట్కు శతకం (127 పరుగులు) భాగస్వామ్యం నిర్మించాడు. 'నితీశ్ రెడ్డి అద్భుతమైన ఆటగాడు. మానసికంగా చాలా దృఢంగా ఉంటాడు. ఎంసీజీ (మెల్బోర్న్ క్రికెట్ స్టేడియం)లో అతను చేసిన ఈ సెంచరీ ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఏ పని అప్పగించినా వంద శాతం దానికి న్యాయం చేస్తాడు. అతను సెంచరీ చేయడం చూస్తుంటే మా అందరికీ చాలా ఆనందంగా ఉంది' అని వాషింగ్టన్ సుందర్ పేర్కొన్నాడు.


## ఆరోగ్యం

# ఈ అలవాట్లు ఉంటే మిమ్మల్ని అందరూ దూరం పెడతారు .. చివరికి ఒంటరిగా మిగిలిపోతారు..




మంచి అలవాట్లు, నడవడిక ఉంటేనే జీవితంలో ఏదైనా సాధించగలుగుతాం. జీవితంలో విజయం సాధించాలంటే కొన్ని మంచి విషయాలను అలవర్చుకోవాలి. కొన్ని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. చెడు అలవాట్లకు దూరంగా లేకపోతే మీరు పురోగతి సాధించలేరు. కొన్ని అలవాట్లకు గుడ్ బై చెబితేనే మీరు జీవితంలో ఖచ్చితంగా విజయం సాధించగలరు. అలాగే, నలుగురిలో పేరు సంపాదించాలన్నా.. అదే నలుగురిలో ఓ బంధం ఏర్పరచుకోవాలన్న మంచి అలవాట్లు ఉండాలి. అయితే, కొన్ని అలవాట్లు ఉంటే ఎవరూ కూడా మీతో స్నేహం లేదా బంధం ఏర్పర్చుకోవడానికి ఇష్టపడరు. ఈ అలవాట్లు మిమ్మల్ని నలుగురిలో దోషిగా నిలబెడతాయి. చివరికి మీరు ఒంటరివారిగా మిగిలిపోతారు. మనిషికి ఉండకూడని అలవాట్లు ఏంటో ఇక్కడ తెలుసుకుందాం.

### మీ మాటే నెగ్గాలనుకోవడం..



కొందరు అనవసరంగా ఇతరుల విషయాల్లో తలదూర్చుతుంటారు. అంతా తమకే తెలుసన్న అభిప్రాయంతో ఉంటారు. ఇతరులకు లేని పోని సలహాలు ఇస్తూ.. తమ మాట నెగ్గించుకునే ప్రయత్నం చేస్తారు. ఇతరుల అభిప్రాయాల్ని తక్కువ చేసి.. తమ సలహాలు గొప్పవని నమ్మించే ప్రయత్నం చేస్తారు. అయితే, ఈ అలవాటు ఎంత మాత్రం మంచిది కాదు. కచ్చితంగా ఈ అలవాట్లు నలుగురిలో మిమ్మల్ని స్వార్థపరులుగా మారుస్తుంది. మీతో స్నేహం, బంధం ఏర్పచుకోవడానికి ఎవరూ ఆసక్తి చూపరు. ఈ అలవాట్లు వల్ల బంధువులు కూడా మీకు దూరంగా ఉంటారు. అందుకే ఈ అలవాటుకు వెంటనే గుడ్ బై చెప్పేయండి.

### ఇతరుల భావాల్ని అర్థం చేసుకోకపోవడం..



చాలా మంది ఇతరుల భావాల్ని అస్సలు పట్టించుకోరు. ఎదుటి వారు ఏం చెబుతున్నారు.. వారికి ఉన్న కష్టాలేంటని లెక్క చేయరు. తమ అభిప్రాయాల్ని ఇతరుల మీద బలవంతంగా రుద్దుతారు. ఈ అలవాటు మీ సంబంధాలకు కూడా చాలా హాని కలిగిస్తుంది. ఇతరుల భావాలను మనం అర్థం చేసుకోనప్పుడు, వారు మనల్ని హృదయం లేని వారిగా భావిస్తారు. దీంతో మీతో సఖ్యంగా ఉండటానికి ఎవరూ ఆసక్తి చూపరు. దీంతో.. మీరు మనుషులకు దూరమవుతారు.

### ఎల్లప్పుడూ ఇతరుల్ని పోల్చడం..




ఈ అలవాటు కూడా చాలా మందికి ఉంటుంది. ఉదాహరణకు అరె గోపి నీ కన్నా సురేష్ చాలా గొప్పగా చదువుతాడు. ఏ మమత ఆ సుధా నీ కన్నా అందంగా ఉంటుంది. ఇలా చాలా మంది ఒకర్ని మరొకరితో పోలుస్తూ ఉంటారు. ఒకరి మాటలు ఇంకొకరి దగ్గర ప్రస్తావిస్తూంటారు. వారి పనులు జరుపుకోవడం కోసం ఇలా ఇతరుల్ని పోల్చడం లాంటివి చేస్తారు. అయితే, ఇది ఎంత మాత్రం మంచి అలవాటు కాదని గుర్తించుకోవాలి. ఇది కచ్చితంగా ఇతరుల ముందు మిమ్మల్ని అసూయ పరులుగా చూపిస్తుంది. ఇలాంటి వారితో స్నేహం చేస్తే మనకే నష్టమన్న భావన అందరిలో వస్తుంది. చివరికి మీరు ఒంటరిగా మిగిలిపోయే ప్రమాదముంది.

### అబద్ధాలు చెప్పడం..



చాలా మంది ఇతరుల మీద గొప్పలు చెప్పుకోవడానికి లేదా మోసం చేయడానికి అబద్ధాలు చెబుతూ ఉంటారు. అయితే, అబద్ధాలు చెప్పడం వల్ల మీకే నష్టం కలుగుతుంది. ఈ అలవాటు ఉంటే మీతో ఎవరూ స్నేహం చేయరు. ఈ అలవాటు కచ్చితంగా మిమ్మల్ని నలుగురిలో ద్రోహులుగా నిలబెడుతుంది. మీరు చెప్పేవి అబద్ధాలని ఇతరులకు తెలిసినప్పుడు అప్పుడు పరిస్థితి ఏంటని ఆలోచించుకోండి. అబద్ధం ఇతరుల నమ్మకాన్ని నాశనం చేస్తుంది. దీంతో.. మీ సంబంధం చెడిపోతుంది. ఎవరూ కూడా మిమ్మల్ని నమ్మడానికి ఆసక్తి చూపరు. ఒక వేళ నిజం చెప్పినా.. అది కూడా అబద్ధమే అనుకుంటారు.

### నెగటివ్ థింకింగ్..



చాలా మంది ప్రతి దానికి నెగటివ్‌గా ఆలోచిస్తారు. ఇలాంటి ప్రతికూలంగా ఆలోచించేవారు.. ముందుకు సాగలేరు. వారు మనస్సులో ఎప్పుడూ వైఫల్యాలే భావనలే మెదలుతాయి. ఇలాంటి వారు చుట్టూ ఉన్న మంచిని చూడలేరు. నిరాశను మాత్రమే ఫీల్ అవుతారు. మనం ఈ పని చేయలేం.. ఫలానా పనిచేస్తే పక్కన వాళ్లు ఏం అనుకుంటారు.. ఇలాంటి ఆలోచనలకు చెక్ పెట్టాలి. ప్రతికూలంగా ఆలోచించడం వల్ల మీ ఆత్మ విశ్వాసం దెబ్బతింటుంది. ఇతరుల్ని కూడా మీరు ఆ పని చేయకండి.. చేస్తే నష్టపోతారని చెబుతుంటారు. ఇలా చేయడం వల్ల మీ ప్రతికూల భావనలు నచ్చక ఇతరులు మిమ్మల్ని దూరం పెట్టే అవకాశం ఉంది. దీంతో మీరు చివరికి ఒంటరిగా మిగిలిపోతారు.

**గమనిక..**

ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల మానసిక ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం.